షాడో బాస్!

పోలీసు శాఖలో కిందిస్థాయి అధికారి హవా

ఆయన మాటే శాసనం

కీలకమైన ఎస్బీలో పైఅధికారిని డమ్మీ చేసిన వైనం

ప్రతినెలా భారీగా ముడుపులు

ఆయన ద్వారానే ఉన్నతాధికారులకూ..



అనంతపురం క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఆయనో సాధారణ అధికారి. అయినా.. శ్రీ సత్య సాయి జిల్లా అంతటా ఆయన చెప్పిందే వేదం. చాలా కీలక విషయాల్లో అయన మాటే శాసనం. ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ జిల్లాలో పోలీసు శాఖను గుప్పిట్లో పెట్టుకున్నారు. పోలీసు శాఖలో కీలకమైన ప్రత్యేక విభాగంలో పనిచేసే ఈయన ఆ స్థాయిలో హవా సాగిస్తున్నారు. ఉన్నతాధికారులకు సైతం ఆయన నుంచే ముడుపులు వెళ్తుంటాయట. శ్రీసత్యసాయి జిల్లాలో హోంగార్డుల నుంచి పైఅధికారుల వరకు ఆయన నామమే జపిస్తుంటారు. జిల్లావ్యాప్తంగా పేకాట జోరుగా సాగుతోందనేది బహిరంగ రహస్యం. ప్రతి పట్టణం, మండలాల పరిధిలో జూద కేంద్రాలు నడుస్తున్నాయి. ఆ సార్‌ను చూసి జిల్లాలో చాలామంది సీఐలు, ఎస్ఐలు రెచ్చిపోతున్నారట. రెండు చేతులా సంపాదించడంలో బిజీ అయ్యారు. మద్యం దుకాణాల నుంచి ప్రతినెలా ముడుపులు, ఇసుక అక్రమ రవాణా, మట్కా, పోలీసు స్టేషన్లలో పంచాయితీలు, సెటిల్మెంట్లు ప్రతి పనికీ డబ్బులే డబ్బులు.

అక్కడ ఆయనదే వేదవాక్కు. అమ్యామ్యాలు అధికంగా

ఆయన మాటే శాసనం...

వచ్చే విషయాల్లో సైతం ఈ చిన్న సారు తలదూరుస్తారు. పోలీసు శాఖలో ప్రత్యేక విభాగాధికారులు.. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతోపాటు పరిస్థితులను వివరిస్తుంటారు. ఈ విభాగంలో పనిచేసే ఓ అధికారిని ఎవరు చేశారో కానీ డమ్మీ అయిపోయారు. దీంతో కింది స్థాయిలో పనిచేస్తున్న ఈయన తన దైన శైలిలో చక్రం తిప్పారు. మీడియా సమావేశంలో సైతం ఆ శాఖ ఉన్నతాధికారి పక్కన ఈయన ఆశీనులవుతారంటే ఆయన ఏస్థాయిలో చక్రం తిప్పుతున్నారో అర్థమవుతుంది. బదిలీల నుంచి కీలకమైన ఫైళ్ల విషయం వరకు ఈయనే చొరవ తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా సబ్ డివిజన్ల పరిధిలోని కీలకమైన పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రతి పబ్లిక్ పేకాట కేంద్రం నుంచి ప్రతివారం ముడుపులు ముట్టాల్సిందే. స్థానిక పోలీసు స్టేషన్ల పరిధి సీఐలు, ఎస్ఐలు ఏం చేసుకున్నా సంబంధం లేదు. ఆయనకు వెళ్లాల్సిన వాటా వెళ్లాలంతే. ఇక పైఅధికారులకు ఆయన ద్వారానే వెళ్తాయట.

వైసీపీ హయాంలో ఈయనేం చేశారంటే...

వైసీపీ ప్రభుత్వంలోనూ ఈ ఎస్ఐ బాగానే చక్రం తిప్పారు. ధర్మవరం పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే మాటలు తూచ తప్పకుండా పాటించేవారట. వైసీపీ నేతలు ఎవరిపై ఈ ఎస్ఐకి ప్రత్యేకంగా చెబుతారో వారిని గంటల్లో పోలీసు స్టేషన్‌కు పిలిపించేవారు. ఆ నేతలు ఈయనతో ఫోన్‌లో మాట్లాడుతుండగానే వారిని బెల్ట్‌తో కొట్టడం చేసేవారట. వారి ఆనందం కోసం గోడలపై కొట్టి వీరిని అరవమనేవారట. ఆ సమయంలోనూ ఈయన బాగానే ఆర్జించారని సమాచారం. ఇలా వైసీపీ నేతలకు గులాం కొట్టిన అధికారి ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలోనూ జిల్లా అంతా పెత్తనం చేస్తున్నారంటే.. ఏ ఎండకా గొడుగు పట్టడంలో దిట్ట అనడంలో సందేహం లేదు.

అంతకుమించి కావాలంటారు..

పుట్టపర్తిలో పేకాట జోరుగా సాగుతోంది. అందుకు సహకారం అందించినందుకు సంబంధిత పబ్లిక్ పేకాట కేంద్రాల నుంచి షాడో బాస్‌కు ప్రతి వారం రూ.2లక్షలకు పైగా ముడుపులు అందుతాయట. ఎస్ఐ స్థాయి నుంచి వచ్చిన ఓ ఉన్నతాధికారి ముడుపులకు బాగా అలవాటుపడ్డారట. దీంతో గాంబ్లింగ్ కన్నా పెద్దవేమీ లేవా అని అడుగుతుంటారట.

ఒక్కరే... ఆదాయమే ఎక్కువ..



ఫ్యాక్షన్, పట్టుచీరలకు పేరొందిన ఓ నియోజకవర్గ కేంద్రం, పరిసర ప్రాంతాల్లో పేకాట విపరీతంగా సాగుతోంది. సంబంధిత వాటి నుంచి అక్కడి సీఐలకు ప్రతి నెలా ముడుపులు అందుతాయి. పేకాట నుంచే నెలనెలా రూ.లక్ష తప్పనిసరట. పట్టణ పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఓ సీఐ ఫైసలు తీసుకునేందుకు ఉత్సాహం చూపుతారట. ఓ ఘటన విషయంలో బాధిత కుటుంబం కేసు (పోక్సో) వద్దని చెప్పినా.. సంబంధిత వ్యక్తి నుంచి రూ.50వేలు వసూలు చేశారట. ఓ వ్యక్తి మరో వ్యక్తికి రూ.5 లక్షల బాకీ చెల్లించాల్సి ఉందట. పోలీసు స్టేషన్‌లోనే అధికారి ముందు ఇస్తానని చెప్పడంతో అక్కడికెళ్లారు. ఆ సారు రూ.50 వేలు ఇచ్చుకోవాల్సిందేనన్నారట. ఈయన అక్కడున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ ద్వారా అన్ని వ్యవహారాలు నడుపుతారని సమాచారం. ఇక పంచాయితీలు, సెటిల్మెంట్లు ఆ పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్‌గా సాగుతుంటాయట. ఇక అయన కానిస్టేబుళ్లంటే బాగా చిరాకుపడతారట. ఉత్తుత్తికే తన చాంబర్‌కు రావద్దని కసురుకుంటారట. మరో పోలీసు స్టేషన్‌లో ఫైసలిస్తేనే పని జరుగుతుందట. ఏ పంచాయితీ అయినా నీ కింత.. నాకింత.. అంటారట.

పేకాట కేంద్రాల నుంచి లకారాలే..

పట్టుచీరలకు కేంద్రంగా మారిన నియోజకవర్గ కేంద్రం పరిధిలో పనిచేసే ఓ అధికారి అవినీతి మరోస్థాయిలో ఉందట. అనంతపురం జిల్లాలో ఓ ప్రత్యేక విభాగంలో పనిచేసి బదిలీపై వచ్చిన ఈయన జోష్ పెంచారట. ఓ సిల్క్ హౌస్‌పై వివాదం తలెత్తడంతో నాలుగు నెలల క్రితం కమ్యూనిస్టులు ఆందోళన చేపట్టారు. వారి ఆందోళన ఉధృతం కాకుండా ఆపేందుకు రూ.5లక్షలు బేరం కుదుర్చుకున్నారట సంబంధిత అధికారి. ఈయన పరిధిలో **(మిగతా 8వ పేజీలో..)**

స్వచ్ఛాంధ్రలో ఫస్ట్

ఉత్తమ అవార్డు అందుకున్న కలెక్టరు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలులో అనంత జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు (ఫస్ట్ ర్యాంకు) దక్కింది. జిల్లాలో అన్ని పంచాయతీలలో వంద శాతం ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈనేపథ్యంలో గురువారం అమరావతి పరిధిలోని మంగళగిరి సీకే కన్వెన్షన్‌హాల్‌లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈవేడుకలలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, చేతుల మీదుగా జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కమిషన్ ఛైర్మన్ పట్టాభి, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

పామిడి సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స

పామిడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో గంగావతి అనే మహిళకు అరుదైన కండ్రైలోమా ఎక్యూమినేటా(కణతి) తొలగింపు శస్త్ర చికిత్సను గురువారం విజయవంతంగా చేసినట్లు వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి తెలిపారు. యాడికికి చెందిన గంగావతి కణతి సమస్యతో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించింది. జనరల్ సర్జన్ డాక్టర్ కమలాధర్ పరీక్షించి, శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ప్రభుత్వాస్పత్రిలోనే ఆపరేషన్ చేసి, కణతిని తొలగించి ఆమెకు ఉపశమనం కల్పించారు. ఆపరేషన్‌కు సహకరించిన వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్ రెడ్డి, హెడ్‌నర్సు శివకుమారి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ అంజినప్ప, వైద్య బృందానికి గంగావతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రోగితో వైద్యులు శివకార్తీక్ రెడ్డి, కమలాధర్

డిపాజిటర్లందరికీ

డబ్బు చెల్లిస్తాం

డీసీఓ, ఉరవకొండ టౌన్‌బ్యాంకు లిక్విడేటర్ అరుణకుమారి



అనంతపురం క్లాక్ టవర్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు డిపాజిటర్లందరికీ డబ్బు తిరిగి చెల్లిస్తామని డీసీఓ, బ్యాంకు లిక్విడేటర్ అరుణకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. ఉరవకొండ టౌన్‌బ్యాంకు గుర్తింపును రద్దు చేస్తూ రిజర్వు బ్యాంకు గత ఏడాది నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో తమ డిపాజిట్ సొమ్ము వెనక్కు రాదని డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్(డీఐసీజీసీ) కు 4811మంది డిపాజిటర్లు, రూ.5.92కోట్లు మొత్తాన్ని వివరాలతో పంపామన్నారు. అయితే డీఐసీజీసీ నుంచి 1120మందికి రూ.4.20కోట్లు డిపాజిట్లు తిరిగి చెల్లించేందుకు అప్రూవల్ వచ్చిందన్నారు. మిగిలిన వారికి కేవైసీ ఇవ్వలేదని...ఇందుకు గాను రూ.88.95లక్షలు ఉందన్నారు. రూ.5లక్షలు పైన ఉన్న వారిలో 26మంది ఉన్నారన్నారు. 15రోజుల్లో డిపాజిటర్లు అందరికీ మొత్తాన్ని చెల్లిస్తామన్నారు. డిపాజిటర్లు ఉరవకొండ టౌన్ బ్యాంకులో ఒరిజినల్ ఎఫ్‌డీ బాండ్, బ్యాంకు డిపాజిట్ బుక్, ఆధార్, పాన్, పాసు పుస్తకాలు అందజేయాలన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతోనే ఇదంతా సాధ్యమైందని, ఆయనకు డిపాజిటర్ల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

మొత్తం గేట్లు

మార్చాల్సిందే

టీబీ డ్యాంపై తేల్చి చెప్పిన కేపీఎన్‌డీటీ సంస్థ

- తుప్పుపట్టి దెబ్బతిన్న గేట్ల అంచులు
- తుంగభద్ర బోర్డుకు నివేదిక అందజేత
- ఒక్కో గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2కోట్ల వ్యయం



7

ఉగ్రదాడికి నిరసనగా..

న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా జిల్లా కోర్టులోని న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ధరంసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు విధులు బహిష్కరించాలని తీర్మానించారు. అనంతరం కోర్టు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు ధరంసింగ్‌నాయక్ మాట్లాడుతూ... ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంబంధిత సంస్థలపై ప్రభుత్వం నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. పాకిస్తాన్‌కు సహాయ నిరాకరణతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ అంతర్జాతీయ వేదికలపై వినిపించాలన్నారు. దేశభద్రతను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్ఆర్‌కే మోహన్, భరత్ భూషణ్, రఘుప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.



విధులను బహిష్కరించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చౌరబడి.. ఖాళీ

స్వాధీనం చేసుకున్న అధికారులు



దారికి అడ్డుగా వేసిన కంపలను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడపనకల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు ఆక్రమించిన ఉండబండ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పోలీసులు గురువారం ఖాళీ చేయించారు. వినియోగంలో లేని ఈ భవంతిని వైసీపీకి చెందిన పల్లె రామలింగ కుటుంబం ఆక్రమించింది. ఈ వ్యవహారంపై 'చౌరబడి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో జనవరి 21న కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మూడు నెలల నుంచి నోటీసులు జారీ చేస్తున్నా వారు ఖాళీ చేయలేదు. దీంతో ఈ నెల 8న విడపనకల్లులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి పయ్యావుల కేశవ్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో పోలీసు, ఇతర శాఖల అధికారులు గురువారం గ్రామానికి చేరుకుని ఖాళీ చేయించారు.

అడ్డుకున్న వైసీపీ వర్గీయులు

పాఠశాల స్థలం తమదని, ఖాళీ చేయడం కుదరదని ఆక్రమించిన వైసీపీ వర్గీయులు భీష్మించారు. దీంతో ఇప్పటికే కేసు నమోదైందని, అడ్డు తొలగకపోతే మరో రెండు కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. హక్కు పత్రాలు ఉంటే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. పాఠశాల గదుల్లో ఉన్న సామగ్రిని తొలగించి, ఖాళీ చేయించారు. గ్రామంలో గొడవలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు సీఐ చిన్నగౌస్, మహానంది, రాజు, విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్, ఉరవకొండ ఎస్ఐ జనార్దననాయుడు, పాల్తూరు ఎస్ఐ మురహరిబాబు, వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి, బెళుగుప్ప ఎస్ఐ గనపురం శివ, తహసీల్దారు చంద్రశేఖరయ్య, ఎంపీడీఓ షకీలాబేగం, ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు గ్రామానికి వెళ్లారు.

ఐటీఐ స్థలం సర్వే

మరోమారు తెరపైకి వివాదం

పూర్వీకుల స్థలం అంటున్న ప్రైవేటు వ్యక్తులు

కాలేజీదే అంటున్న ప్రిన్సిపాల్, అధికారులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్థల వివాదం మరోమారు తెరపైకి వచ్చింది. కళాశాలకు కేటాయించిన భూమి, ఆవరణ చుట్టూ ఖాళీగా ఉన్న స్థలం తమ పూర్వీకులదని ప్రైవేట్ వ్యక్తులు అంటున్నారు. కానీ అది కళాశాల స్థలమేనని ప్రిన్సిపాల్ అంటున్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ వ్యక్తులు, కళాశాల అధికారులు వేర్వేరుగా స్థలాన్ని సర్వే చేయించేందుకు సర్వే శాఖ ఏడీకి దరఖాస్తు చేసుకున్నారు. సర్వేయర్ రఘునాథ్ ఆధ్వర్యంలో గురువారం కళాశాల భూమిని సర్వేచేయించారు. అయితే, ఐటీఐ కళాశాలకు ఆనుకుని ఉన్న స్థలాల వారికి నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయడంతో కాసేపు వివాదం తలెత్తింది.

కాలేజీ స్థలమే..

వైసీపీ హయాంలో కళాశాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రైవేటు వ్యక్తులు ప్రయత్నించారు. ఆ సమయంలో సర్వే శాఖ అధికారులు కొలతలు వేసి, ఆ స్థలం కాలేజీదేనని తేల్చారు. ఆరంభంలో ఆ ప్రాంతంలో గుంతలు, రాళ్లతో కూడిన భూమి అని డాక్యుమెంట్లలో పేర్కొన్నారు. ఇప్పుడు సర్వే నంబర్లు మారిపోయాయి. కాలేజీ చుట్టూ నివాస గృహాలు పెరిగిపోయాయి. కానీ ఆ మేరకు కార్పొరేషన్, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరగలేదు. దీంతో పూర్వపు డాక్యుమెంట్లతో స్థలం ప్రైవేటు వ్యక్తులదని నిర్ధారించడం కష్టమని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు.

కాలేజీ స్థలం 12.18 ఎకరాలు..

ఐటీఐ కళాశాల స్థల విస్తీర్ణం 12.18 ఎకరాలు. సర్వే నంబరు 2,685 నుంచి 337 వరకు దాదాపు 23 సర్వే నంబర్లలో ఈ 12.18 ఎకరాలు ఉందని రెవెన్యూ రికార్డులు చూపుతున్నాయి. కానీ కళాశాల భూమి తమదేనని ప్రైవేట్ వ్యక్తులు బోర్డులు నాటుతున్నారు. వారిని అడ్డుకుని పోలీసులను ఆశ్రయిస్తున్నాం. జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మిస్తే ఈ సమస్య ఉండదు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాం.

- రామమూర్తి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

సర్వే అధికారులను ప్రశ్నిస్తున్న ప్రైవేటు వ్యక్తులు



మా పూర్వీకులది...



ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు కేయించిన స్థలం మా పూర్వీకులది. ఇందుకు డాక్యుమెంట్లు సాక్ష్యాలుగా ఉన్నాయి. కొడికి లత్తవరం నాగప్ప అనే వ్యక్తికి చెందిన 10ఎకరాలకు పైగా స్థలంలో కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు ఆరు ఎకరాలు పోగా మిగిలిన నాలుగు ఎకరాల భూమిని వేరు చేయడానికి సర్వే చేయిస్తున్నాము. నాగప్ప వంశవృక్షంలో మా న్నాన్న నాగరాజు నాలుగోతరం వారు. నేను ఐదో తరం వాడిని. రికార్డుల ప్రకారమే మా స్థలం చూపించాలని అడుగుతున్నాము.

-దిలీప్



వివాదాస్పద స్థలం

అన్నదాత ఆనందం డబుల్

జిల్లాకు మరో 600 ట్రాన్స్‌ఫార్మర్లు.. పది రోజుల్లోనే రెండు విడతలు



అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు కొత్త ప్రభుత్వం ఆనందం పంచింది. పది రోజుల వ్యవధిలో జిల్లాకు రెండో విడత ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసింది. పదిరోజుల క్రితమే జిల్లాకు 650 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం సరఫరా చేసింది. తాజాగా మరో 600 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసినట్లు ఎస్ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. మండలాల వారీగా సంబంధిత ఏఈఈలకు వాటిని కేటాయించామన్నారు. గతేడాది జూన్ వరకు వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని, డబ్బు చెల్లించిన వారికి వీటిని అందిస్తామన్నారు. సీనియారిటీ మేరకు పంపిణీ చేస్తామన్నారు. గతేడాది డిసెంబరు చివరి వరకు పెండింగ్‌లో ఉన్న రైతులకు మరో 800 ట్రాన్స్‌ఫార్మర్లు కావాల్సి ఉందన్నారు. అవి కూడా విడతల వారీగా వచ్చే అవకాశం ఉందన్నారు. అవి వస్తే జిల్లాలో చాలావరకు వ్యవసాయ కనెక్షన్ల సమస్య కొలిక్కివచ్చే వీలుందన్నారు.

గ్రామసభలో డిష్యూం.. డిష్యూం..!

బీజేపీ మండలాధ్యక్షుడిపై పారిశుధ్య కార్మికుల దాడి

పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

పామిడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామసభ సాగుతుండగా పారిశుధ్య కార్మికులు, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. బీజేపీ మండలాధ్యక్షుడు అంజినాయక్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి కొడవండ్ల కుమారస్వామితో పారిశుధ్య కార్మికులు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి వారిపై పారిశుధ్య కార్మికులు దాడి చేశారు. అక్కడున్న వారు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీనిపై పంచాయతీ ఈఓ గోపాల్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బీజేపీ నాయకులు దురుసుగా ప్రవర్తిస్తూ, బెదిరింపులు, దాడులకు దిగుతున్నారన్నాంనను. పంచాయతీ అధికారులు, సిబ్బందితో కలిసి ఈఓ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈఓ అక్రమాలకు తాము అడ్డుపడుతున్నామని పారిశుధ్య కార్మికులతో దాడి చేయించాడని అంజినాయక్ చౌహాన్, కొడవండ్ల కుమారస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి ఫిర్యాదులను స్వీకరించారు. విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది



భక్తిశ్రద్ధలతో సత్యసాయి ఆరాధన

500 జిల్లాల్లో ప్రేమప్రవాహిని ప్రచారం

ఆరు నెలలపాటు శత జయంతి ఉత్సవాలు

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

7



వంశీ (ఫైల్)

నీటి కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి



గోవిందరాజులు (ఫైల్)

క్రీడాయాప్‌తో నకిలీకి చెక్

డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహాయంతో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామని ఉమ్మడి జిల్లా డీఎస్‌డీఓ (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి) ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. రెండు జిల్లాలకు డీఎస్‌డీఓగా వ్యవహరిస్తున్న ఆయన క్రీడాశాఖలో అభివృద్ధి చేస్తున్న అంశాలపై వివరించారు.

ప్రశ్న: నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లకు ఎలా అడ్డుకట్ట వేస్తారు...?

డీఎస్‌డీఓ: ఆధార్‌నంబర్ ఆధారంగా ఎప్పుడు, ఎక్కడ ఏ క్రీడాపోటీల్లో పాల్గొన్నారో తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా క్రీడా యాప్‌ను తయారు చేసింది. దీని ద్వారా నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేయవచ్చు.

ప్రశ్న: అనంతపురం జిల్లాలో ఔట్ డోర్ స్టేడియం నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది?

డీఎస్‌డీఓ: నిర్మాణానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. ప్రజాప్రతినిధుల సహకారం, ఉన్నతాధికారుల ప్రమేయంతోనే అది సాధ్యం అవుతుంది.

ప్రశ్న: శ్రీసత్యసాయి జిల్లాలో క్రీడాస్టేడియాల నిర్మాణం పరిస్థితి ఏమిటి ?

డీఎస్‌డీఓ: ధర్మవరంలో హాకీ టర్ఫ్ ప్లేఫీల్డ్ నిర్మాణానికి మార్కెట్‌యార్డు సమీపంలో 9ఎకరాల స్థలాన్ని పరిశీలించాం. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి హామీ మేరకు ఈ హాకీ టర్ఫ్ ప్లేఫీల్డ్ నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న: నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు ఎలా ఉన్నాయి...?

డీఎస్‌డీఓ: ఈ స్టేడియంలో 60ఏళ్లుగా లక్షలాది మంది క్రీడాకారులు సాధన, శిబిరాలు నిర్వహించి ఎన్నో అద్భుత విజయాలు సాధించారు. ప్రస్తుతం కొన్ని అనివార్యకారణాలతో క్రీడాకారులకు కొంత అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమే. సమన్వయంతో పరిస్థితిని సరిదిద్ది క్రీడాకారులకు అనుమతి పొందాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుకుంటాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో క్రీడా స్టేడియాలు, సదుపాయాల పరిస్థితి ఎలా ఉంది?

డీఎస్‌డీఓ: 14 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు స్టేడియాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం, శాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గానికి ఒక స్టేడియం నిర్మాణంపై తదుపరి కార్యాచరణ చేపడతాం.

ప్రశ్న: సమ్మర్ కోచింగ్ క్యాంపుల పరిస్థితి ఏమిటి..?

డీఎస్‌డీఓ: ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రభుత్వం-శాప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో వంద కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని, ప్రతి క్యాంపులో 50మంది క్రీడాకారులను భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. రెండు జిల్లాల్లో కలిపి మే 1 నుంచి 31 వరకు వంద వేసవి శిక్షణా శిబిరాల్లో 5వేల మంది క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చారు.

ప్రశ్న: నిధులు దుర్వినియోగం చేసి నార్పల కోచ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఎస్‌డీఓ: నార్పల స్టేడియంలో ఉన్న కోచ్ రమేష్ విధులకు గైర్హాజరవుతూ, నిధులు సొంతానికి వాడుకున్న అంశాలపై శాప్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. భవిష్యత్తులో ఏ కోచ్ ఇలా నిధుల దుర్వినియోగానికి పాల్పడకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీ ఎలా ఉంది?

డీఎస్‌డీఓ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన క్రీడాపాలసీ క్రీడలు, క్రీడాకారులకు ఎంతో మేలు కలిగించేలా ఉంది. క్రీడా రిజర్వేషన్‌తో క్రీడాకారుల్లో ఆసక్తి, ప్రోత్సాహం పెరిగింది. వచ్చిన అవకాశాలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలి.

మొత్తం గేట్లు మార్చాల్సిందే

టీబీ డ్యాంపై తేల్చి చెప్పిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ


- తుప్పుపట్టి దెబ్బతిన్న గేట్ల అంచులు
- తుంగభద్ర బోర్డుకు నివేదిక అందజేత
- ఒక్కో గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2కోట్ల వ్యయం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు 33కి కాలం తీరింది. మొత్తం గేట్లు మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే గత ఏడాది తరహాలో ఎప్పుడైనా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. డ్యాం గేట్ల పటిష్టతపై 'కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్' నిర్వహించిన చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ ఇదే విషయాన్ని సమగ్ర వివరాలతో టీబీపీ బోర్డుకు నివేదిక రూపంలో ఇచ్చింది. గత ఏడాది ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలకు తుంగభద్ర బోర్డు అధికారులు నివేదిక పంపించారు.

ఏపీ రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారులు, సాగునీటి రంగ నిపుణులు కన్నయ్యనాయుడు నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం టీబీ డ్యాం గేట్ల పరిస్థితిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాతగేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చే విధానంపై సమాలోచనలు చేశారు. కొత్త గేట్లను ఏర్పాటు చేయాల్సిందేనని ఇంజనీర్లు నిర్ణయించారు. దీంతో మొత్తం 33 గేట్లు మార్చేందుకు ఇంజనీర్లు ఉపక్రమించారు. ఇటీవల గేట్ల ఏర్పాటుకు సంబంధించి టెండర్లను కూడా పిలిచారు.

19వ క్రస్ట్‌గేట్‌కు ఏర్పాటు చేస్తున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ (ఫైల్)





మూడు రాష్ట్రాలకు ప్రధాన నీటి వనరు

టీబీ డ్యాం ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగు నీరు అందుతోంది. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాలకు టీబీపీ ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, కేసీ కాలువల ద్వారా తుంగభద్ర డ్యాం నుంచి 66.50 టీఎంసీలు నీటి వాటా ఉంది. ఖరీఫ్, రబీలో దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో మెజార్టీ గ్రామాలకు తాగు నీరు అందించే ప్రధాన నీటివనరు ఈ ప్రాజెక్టు. 1953 నుంచి ఆయా రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు కాపాడున్న తుంగభద్ర డ్యాం ప్రస్తుతం ప్రమాదంలో పడింది. డ్యాం గేట్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు ఇచ్చిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. 2024 ఆగస్టు నెలలో వరద ఉధృతికి 19వ నంబరు క్రస్ట్‌గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసింది. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో ఆ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ అప్పట్లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒక గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో మిగిలినవి భద్రమేనా అన్న సందేహాలు అప్పట్లోనే తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నాయకత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ డ్యాం, గేట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. గేట్ల జీవిత కాలం తీరిపోవడం వల్ల మరమ్మతులతో కాలయాపన చేయకుండా 33 గేట్లును మార్చాలని, గేట్ల ఏర్పాటులో అనుభవం కలిగిన సంస్థతో అధ్యయనం చేయించాలని సూచిస్తూ నివేదిక ఇచ్చింది.

శిథిలావస్థకు చేరిన గేట్లు

ఏకే బజాజ్ కమిటీ సూచన మేరకు తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు టెండర్ల ద్వారా ఎంపిక చేసిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ క్షేత్రస్థాయిలో డ్యాంను తనిఖీ చేసింది. గత ఏడాది కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు మినహా.. మిగిలిన 32 క్రస్ట్‌గేట్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్ నిర్వహించింది. అల్ట్రా సోనిక్ స్కానింగ్ ద్వారా గేట్ల పటిష్టతను పరిశీలించారు. ఒక్కో గేటు వారిగా ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదికను కేఎస్ఎన్‌డీటీ సంస్థ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు నివేదిక ఇచ్చింది. మెజార్టీ గేట్లు చివర అంచుభాగంలో 60 శాతానికి పైగా తుప్పు (కార్నర్ రస్ట్) పట్టాయని ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. మిగిలిన గేట్లైనా బాగున్నాయా..? అంటే అదీలేదు. ఆ గేట్లు కూడా కొన్ని గేట్లు 50 శాతం, మరికొన్ని గేట్లు 40 శాతానికిపైగా తుప్పు పట్టాయని తేల్చి చెప్పారు. వాస్తవంగా క్రస్ట్‌గేట్ల జీవిత కాలం 42 ఏళ్లే. తుంగభద్ర డ్యాం గేట్లు 72 ఏళ్లకు పైగా వినియోగిస్తున్నాం. ఏనాడో జీవిత కాలం తీరిపోయిన మొత్తం 33 గేట్లు మార్చాల్సిందే అని అధ్యయన సంస్థ ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ, కేఎస్ఎన్‌డీటీ సంస్థ ఇచ్చిన అధ్యయన నివేదికల ఆధారంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలకు, సీడబ్ల్యూసీకి తుంగభద్ర బోర్డు అధికారులు నివేదిక పంపించారు. కాగా.. ప్రస్తుతం ఉన్న గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలంటే.. ఒక్కో గేటుకు దాదాపుగా రూ.2 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన 33 గేట్లకు దాదాపు రూ.66 కోట్లకు పైగా నిధులు అవసరం ఉంది. అయితే.. పాతగేట్లను విక్రయించడం ద్వారా రూ.10 కోట్లు వస్తుందని అంచనా.

19వ గేటు ఏర్పాటుకు చర్యలు



గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్యనాయుడు, ఇంజనీర్లు

గతేడాది కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు ఇంజనీర్లు చర్యలు ప్రారంభించారు. గేటు ఏర్పాటు కోసం రూ.1.98 కోట్లతో టీబీపీ బోర్డు అధికారులు టెండర్లు నిర్వహించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ 3.60 శాతం ఎక్కువ (ఎక్సెస్) రేట్లకు టెండరు దక్కించుకుంది. ఈ సంస్థ ఒక్కటే ఆన్‌లైన్ టెండరు వేసింది. ఈ సంస్థకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఫరక్కా బ్యారేజ్ గేట్లు ఏర్పాటు చేసిన అనుభవం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఆ సంస్థ ఇంజనీర్లు గత సోమవారం తుంగభద్ర డ్యాం, కొట్టుకుపోయిన 19వ గేటును పరిశీలించారు. గేటు తయారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ ఆఖరులోగా నూతన గేటు అమర్చాలని గడువు పెట్టారు. వచ్చే సీజన్ నాటికి అన్ని గేట్లు ఏర్పాటు చేయాలని ఇంజనీర్లు తలచారు.

టెండర్లు పిలిచాం..

టీబీ డ్యాం లోని అన్ని గేట్లను మార్చాలని టెండర్లను పిలిచాం. ఇప్పటికే తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల పటిష్టతపై చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ అధ్యయనం చేసింది. మొత్తం 33 గేట్లు మార్చాల్సిందేనని నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలతో పాటుగా సీడబ్ల్యూసీకి లేఖ రాశాం.



\- నారాయణనాయక్, ఎస్ఈ, టీబీ డ్యాం

కొత్త గేట్ల ఏర్పాటు మంచిదే..



టీబీ డ్యాంలో పాతగేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జిల్లాకు మంచిదే. టీబీ డ్యాం సామర్థ్యం హెచ్చెల్సీపై ప్రభావం చూపుతుంది. గేట్లు పటిష్టంగా ఉండి టీబీ డ్యాంలో నీటి నిల్వ పెరిగితే జిల్లాకు వాటా కన్నా ఎక్కువగా తీసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. హెచ్చెల్సీకి ప్రస్తుతం 32టీఎంసీల నీటి వాటా కేటాయింపు లు ఉన్నాయి. టీబీ డ్యాంలో నీటి నిల్వ పెరిగితే హెచ్చెల్సీకి వాటా కూడా పెరిగే అవకాశం ఉంది. అయితే వచ్చే సీజన్ నాటికి టీబీ డ్యాంలో కొత్త గేట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. కొత్త గేట్ల ఏర్పాటు పూర్తి అయితే టీబీ డ్యాం నుంచి కిందికి నీరు వృథాగా వెళ్ళే అవకాశం ఉండదు. దీంతో నీటిని నిల్వ చేసుకుని వినియోగించు కోవచ్చు.

\-రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

ఉమ్మడి జిల్లాకు హెచ్చెల్సీయే ఆధారం

ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న హెచ్చెల్సీకి టీబీ డ్యాం నుంచే నీరు అందుతోంది. సుమారు 50ఏళ్లుగా టీబీ డ్యాం నుంచే అనంతపురానికి సాగు, తాగునీరు అందిస్తోంది. హెచ్చెల్సీకి టీబీ డ్యాంనుంచి ప్రస్తుతం 32టీఎంసీల నీటి వాటా కేటాయింపులు ఉన్నాయి. జిల్లాలో 1.5లక్షల ఎకరాల ఆయకట్టుకు హెచ్చెల్సీ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఇక జిల్లాలో తాగు నీటి అవసరాలకు ప్రతి ఏటా 10టీఎంసీల వరకు హెచ్చెల్సీ ద్వారా తీసుకుంటున్నారు. డ్యాం భద్రంగా ఉంటేనే ముఖ్యంగా అనంత జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు తీరుతాయి.

షాడో బాస్..!

(5వ పేజీ తరువాయి)

ఇసుక బాగా ఎక్కువగా ఉంది. అక్కడి నుంచి ఇటు అనంతపురం, అటు కర్ణాటకకు రోజూ అక్రమంగా 60 నుంచి 70 టిప్పర్లు వెళ్తాయని సమాచారం. ఒక్కో వాహనానికి రూ.వెయ్యి వేసుకున్నా రోజు ఆదాయం ఇసుక నుంచే రూ.లక్షల్లో. ముదిగుబ్బలోని పీసీ రేవు, తాడిమర్రిలోని సీసీ రేవుకు మాత్రమే అనుమతి ఉన్నా.. ఇక్కడ అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపడుతుంటారు. ఇక ధర్మవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెన్నేకొత్తపల్లి మండలంలో ఒంటికొండ, ఓలంపల్లి ఫారెస్ట్ ప్రాంతంలో, కొత్తచెరువు మండలం బండ్లపల్లి, కదిరేపల్లి కొండ ప్రాంతాలు, బత్తలపల్లి పరిధి నల్లబోయినపల్లిలో పేకాట జోరుగా సాగుతోంది.

మట్కా గెలిస్తే... విజిలేస్తారు..

ఫ్యాక్టరీలెక్కువ, కమర్షియల్ ప్రాంతం. బెంగళూరుకు దగ్గరగా ఉండే ఈ పట్టణంలో మట్కా అధికంగా సాగుతోంది. అక్కడ బహిరంగంగానే మట్కా రాస్తారంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. పట్టణంలోని ఓ పోలీసు స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో మట్కా కేంద్రం నడుస్తుంటుంది. గెలిచిన వారు అక్కడే విజిల్స్ వేస్తారట. మామూళ్ల మత్తులో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడరు. పరిగి బస్టాండులో మట్కా నిర్వహణ బహిరంగ రహస్యమే. ఇక్కడి నుంచి కూడా పోలీసులకు ముడుపులు అందుతాయట. కొన్ని ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. హిందూపురం సమీపంలో కర్ణాటక సరిహద్దులోని సంతేబిదనూరులో రూ.కోటి వరకు పేకాట జరుగుతుంది. ఇక్కడి నుంచి ప్రతినెలా సంబంధిత పోలీసులకు ప్రత్యేక ముడుపులుంటాయని సమాచారం.

అన్నింటికీ నెల మామూళ్లే...

చిత్తూరు, కడప జిల్లాలకు సరిహద్దుగా ఉన్న నియోజకవర్గంలో పేకాట, మట్కా కేంద్రాలు విపరీతంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఓ పోలీసు స్టేషన్, ఓ అప్‌గ్రేడ్ స్టేషన్, మరో మండలంలోని స్టేషన్లలోని ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు మామూళ్లకు బాగా అలవాటుపడ్డారు. శ్రీకృష్ణదేవరాయలు గుర్తుకొచ్చే ఈ నియోజకవర్గంలోని పట్టుకు పేరొందిన ఓ మండలంలో పేకాట నిర్వహణతోపాటు గంజాయి రవాణా అధికంగా సాగుతోంది. పెనుకొండ, పరిగి, రొద్దం మండలాల పరిధిలో పేకాట, మట్కా జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచి అధికారులకు ప్రతినెలా ముడుపులు అందుతాయట. ఎక్కువ పంచాయతీలున్న ఓ మండల పోలీసు స్టేషన్‌లో పంచాయితీలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇతర అసాంఘిక వ్యవహారాలతో నియోజకవర్గంలోనే ఈ పోలీసు స్టేషన్ అధికారులకు ఎక్కువగా ఆదాయం ఉంటుందని సమాచారం.



పొలంలో బిగించిన డ్రిప్ పరికరాలు

కొత్త ఆశలు..!

- సూక్ష్మ సేద్య పరికరాల సబ్సిడీ పెంచాలని రైతుల డిమాండ్
- నూతన మార్గదర్శకాల కోసం ఎదురుచూపు
- మూడు నెలలుగా కాలయాపన



డ్రిప్ పరికరాలు



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాల కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈసారైనా సబ్సిడీ పెంచుతారని ఆశలు పెట్టుకున్నారు. మార్గదర్శకాల జారీలో జాప్యమవుతోంది. దీంతో అన్నదాతలకు నిరీక్షణ తప్పట్లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడువారాలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. గత వైసీపీ సర్కారులో డ్రిప్ సబ్సిడీ తగ్గించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో దానినే కొనసాగించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన పాత సబ్సిడీ విధానాన్ని పునరుద్ధరించి, కరువు రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గతేడాది సబ్సిడీ పెంచలేదు. ఈ నేపథ్యంలో 10 నెలలుగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా... డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేశారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో స్థానిక రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ పెంచాలని కోరుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా సబ్సిడీ పెంచి, న్యాయం చేస్తారని ఆశగా ఉన్నారు.

సబ్సిడీ పెంచాలని రైతుల వేడుకోలు

గతేడాది వైసీపీ సర్కారు అమలుచేసిన సబ్సిడీ ధరలే కొనసాగించడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇచ్చారు. వైసీపీ పాలనలో సూక్ష్మసేద్యం పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్‌లైన్స్ మార్చారు. ఐదెకరాలదాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. ఇతర కేటగిరీల రైతుల తరహాలోనే సబ్సిడీపోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. దీంతో అప్పట్లో కరువు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేయడంతో పాటు టీడీపీ హయాంలో అమలైన పద్ధతిలోనే మిగతా కేటగిరీల రైతులకు డ్రిప్ మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనైనా ఆ హామీని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. మరి ఏ మేరకు ప్రభుత్వం చొరవ చూపుతుందో వేచిచూడాల్సిందే.

టార్గెట్ కుదింపు..!

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ విధించింది. ఉమ్మడి అనంత జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్లదాకా లక్ష్యం విధిస్తూ వచ్చారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. గతేడాది అంతకు రెట్టింపుగా జిల్లాకు 37,500 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. పెద్దసంఖ్యలో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. వైసీపీ సర్కారులో అమలు చేసిన సబ్సిడీనే కొనసాగించడంతో తమ వాటా డబ్బులు చెల్లించేందుకు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో గతేడాది జిల్లా టార్గెట్‌ను 18వేల హెక్టార్లకు కుదించారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 14,869 మంది రైతులకు 17,642 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటిదాకా 13,048 మంది రైతులకు 15,462 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేశారు. ఇంకా 2,180 హెక్టార్లకు సరఫరా చేయాల్సి ఉంది. వాటిలో 8,888 మంది రైతులకు సంబంధించి 10,535 హెక్టార్లలో పరికరాలు బిగించారు.

త్వరలో మార్గదర్శకాలు వచ్చే అవకాశం



రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. గతేడాది విధించిన టార్గెట్ మేరకు రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరు చేశాం. నెలాఖరులో డ్రిప్ మంజూరైన రైతులకుందరికీ పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. నూతన మార్గదర్శకాలు రాగానే ప్రభుత్వం నిర్ణయించే సబ్సిడీని అమలు చేస్తాం. -రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ

సారూ.. ఎక్కడుంటారు మీరు..?

- గ్రామాల్లో కనిపించని వీఆర్వోలు
- కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కీలకమైన గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) అందుబాటులో ఉండటం లేదు. దీంతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోలేదు. వీఆర్వోలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ భూసమస్యలు పేరుకు పోతున్నాయి. బొమ్మనహాళ్ మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. కొందరు వీఆర్వోలు గ్రామాల్లో కాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే పనులు చేస్తున్నారు. గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు, భూ సమస్యల పరిష్కారం కోసం వ్యయప్రయాసలతో మండల కేంద్రానికి రావాల్సిన వస్తోంది. మండలంలో మొత్తం 16 పోస్టులకుగాను 10 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీఆర్వోలు కొరత ఉన్న గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వీరు ఏరోజు ఏ గ్రామంలో ఉంటారో తెలియక ధ్రువ పత్రాల కోసం మండల కేంద్రం, ఇతర గ్రామాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు, రైతులు, ప్రజలకు అవసరమైన పత్రాలు పొందేందుకు వీఆర్వోల సంతకాలు తప్పనిసరి కావడంతో ఆలస్యమవుతోంది. గ్రామ స్థాయిలో భూ సమస్యలు, హద్దుల వివాదాలు, జాయింట్ ఎల్పీనెంబర్లు వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. సకాలంలో పరిష్కారం కాకపోవడంతో ఇవి జటిలంగా మారుతున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన తప్పిదాలు కొత్త ప్రభుత్వంలోనైనా పరిష్కారమవుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్వోలు ఒకరో, ఇద్దరో మండల కేంద్రంలో నివాసం ఉంటే.. చాలామంది బళ్లారి, అనంతపురం ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు మండిపడుతున్నారు. కొందరు వీఆర్వోలు ఎంతో కొంత ఇస్తేగాని సంతకాలు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రెవెన్యూ కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న ప్రజలు

భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం

బొమ్మనహాళ్ మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వీఆర్వోలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా నా దగ్గరికి వస్తే వాటిని పరిష్కరిస్తా. కొన్ని రెవెన్యూలు గ్రామాలకు వీఆర్వోలు లేకపోవడం వల్ల కొందరికి అదనపు బాధ్యతలు ఇచ్చాం. అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం. -మునివేలు, తహసీల్దారు, బొమ్మనహాళ్

గుంతకల్లు రైల్వేకి రెండోసారి అవార్డు

100 శాతం పంక్చువాలిటీ సాధించిన జోన్

గుంతకల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వంద శాతం పంక్చువాలిటీని సాధించిన డివిజన్‌గా గుంతకల్లు రైల్వే జోన్ రికార్డు సృష్టించింది. ఈ సంవత్సరం జనవరిలో గుంతకల్లు రైల్వే డివిజన్ సమయపాలనలో వంద శాతం అచీవ్‌మెంట్ సాధించింది. కాగా ఏప్రిల్‌లో కూడా అవార్డును సాధించి దేశంలోనే రెండుసార్లు వంద శాతం పంక్చువాలిటీ టార్గెట్‌ను అందుకున్న తొలి డివిజన్‌గా గుర్తింపు పొందిందని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే శాఖ 2020 నుంచి వంద శాతం పంక్చువాలిటీని సాధించడానికి కార్యాచరణను రూపొందించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే డివిజన్లలో సమయపాలన విషయంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ ఈ కేలండర్ ఇయర్‌లో రెండుసార్లు పంక్చువాలిటీ అవార్డులను సాధించింది.

గ్రామస్వరాజ్యం వైపు అడుగేద్దాం

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉమ్మడి జిల్లాలో 16 మందికి అవార్డులు



ఎంపీడీఓ తేజోత్స్నను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

అనంతపురం విద్య, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం వైపు అడుగేద్దామని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జడ్పీలోని డీపీఆర్సీ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పహల్గాంలో ఉగ్రమూకల దాడిలో మరణించిన వారికి నివాళిగా మౌనం పాటించారు. తర్వాత జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిన తర్వాత ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చిందన్నారు. దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని గాంధీజీ గ్రామ స్వరాజ్యం కోసం కలలుగన్నారన్నారు. ఆ దిశగా పీఆర్ ఉద్యోగులు అడుగేయాలన్నారు. తర్వాత ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లు, ఉద్యోగులకు చైర్‌పర్సన్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ నాగరాజు పాల్గొన్నారు.

పురస్కారాలకు 16 మంది ఎంపిక

ఉత్తమ సేవా పురస్కారాలకు 16 మందిని ఎంపిక చేశారు. వారిలో ఎంపీడీఓలు తేజోత్స్న, నరసింహనాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు శ్రీనివాసులు, ధనుంజయనాథ్, ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు ధనుంజయ, మహమ్మద్ సుభాన్, రాఘవేంద్రుడు, జూనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వరప్రసాద్, వెంకటేశులు, నవీన్‌కుమార్, టైపిస్టు సుభాష్, రికార్డు అసిస్టెంట్లు శ్రీనివాసులు, చార్లెస్, ఆఫీస్ సబార్డినేట్లు వెంకటయ్య, కుమారి ఉన్నారు.

నీటి కుంటలో మునిగి

ఇద్దరు విద్యార్థుల మృతి


గోవిందరాజులు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


వంశీ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రగిరి గ్రామానికి చెందిన కజ్జి వంశీ (16), గోవిందరాజులు (16) నీటి కుంటలో మునిగి మృతిచెందారు. వీరిద్దరూ పదో తరగతి పరీక్షలు రాశారు. గోవిందరాజులు పాస్ అవ్వగా, వంశీ ఫెయిలయ్యాడు. వేసవి సెలవులు కావడంతో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఎద్దులకు నీరు తాపించేందుకు గురువారం మధ్యాహ్నం బండి కట్టుకుని బయలుదేరారు. గ్రామ సరిహద్దులో, కర్ణాటక పరిధిలో ఉన్న నీటి కుంట వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రంగా ఉండటంతో నీటిని చూడగానే ఎద్దులు ఒక్కసారిగా లోపలికి లాక్కుని వెళ్లాయి. వంశీ, గోవిందరాజులుకు ఈత రాకపోవడంతో మునిగిపోయారు. వీరితో వెళ్లిన అంజినప్ప, పోతురాజు, మహేంద్ర ఒడ్డుకు చేరుకుని గట్టిగా కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల ఉన్నవారు పరుగున వచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. బయటకు తీసేలోగా ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఓ ఎద్దు కూడా నీట మునిగి చనిపోయింది విషయం తెలుసుకున్న వంశీ తల్లిదండ్రులు లక్ష్మి, పోతప్ప, గోవిందరాజులు తల్లిదండ్రులు చిట్టెమ్మ, కుళాయిస్వామి, బంధుమిత్రులు అక్కడికి చేరకుని బోరున విలపించారు. బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరాసుల్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన స్థలం కర్ణాటక పరిధిలో వస్తుందని, బళ్లారి రూరల్ పోలీసులకు సమాచారం అందిస్తామని తెలిపారు.


ప్రేమ ప్రవాహిని కరపత్రాన్ని విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు


నారాయణసేవలో భక్తులు

500 జిల్లాల్లో ప్రేమప్రవాహిని ప్రచారం

- ఆరునెలలపాటు శత జయంతి ఉత్సవాలు
- సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్
- ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు


సంగీత కచేరీ నిర్వహిస్తున్న సాయి భక్తులు


భక్తులకు నారాయణసేవ అందిస్తున్న ఆర్‌జే రత్నాకర్, పల్లె


భక్తులకు చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రేమప్రవాహిని కార్యక్రమం ద్వారా 500 జిల్లాల్లో శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక, ప్రేమతత్వంపై ప్రచారం చేపట్టినట్లు సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్ పేర్కొన్నారు. సాయికుల్వంతులో గురువారం సత్యసాయి 14వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ సంగీతగానంతో అలరించారు. ట్రస్టు సభ్యులు నాగానందం, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సత్యసాయి ప్రేమప్రవాహిని కరపత్రాలను ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి, నాగానందం విడుదల చేశారు. ప్రేమ ప్రవాహిని రథానికి పూజలు చేశారు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో భక్తులకు వస్త్రదానం, లడ్డు ప్రసాదం, పులిహోరాను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నారాయణ సేవలో పాల్గొన్నారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో ప్రేమప్రవాహిని రథం ద్వారా సత్యసాయి ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మిక బోధనలను ప్రచారం చేయడానికి ప్రత్యేక రథాలను సిద్ధం చేశామన్నారు. నవంబరు 2026 వరకు 2.50లక్షల కిలోమీటర్లు పర్యటించి గ్రామాలలో సత్యసాయి ప్రేమతత్వాన్ని తెలియజేస్తామన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆరు నెలలపాటు నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం ప్రశాంతినిలయంలో భక్తులు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని 2026 నవంబరుకి పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరణ కార్యక్రమాన్ని జాతీయ రహదారుల అధికారుల అనుమతులతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరాధనోత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రముఖ గాయకులు ఉత్తర ఉన్నికృష్ణన్ బృందం సంగీత గాన కచేరితో భక్తులను అలరించారు.

వానతో ఉపశమనం..!

- మండుతున్న ఎండలు.. పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- వర్షాలు.. పంట సాగు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న విద్యుత్తు శాఖ

అనంతపురంరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భానుడు భగభగమంటూ విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. ఉదయం ఎనిమిది గంటలు దాటిందంటే ఎండ సుర్రుమంటోంది. పదిగంటలు దాటితే.. బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. మిట్టమధ్యాహ్నం అయిందంటే రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం ఐదుగంటలు దాటే వరకు ఇదే పరిస్థితి. ఆఫీసులు, ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలకు నిరంతరం పనిపడుతోంది. ఫ్యాన్లు తిరుగుతూనే ఉండాల్సిందే. లేదంటే కాసేపు కూసుని ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో రోజువారీగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. జిల్లాకు విద్యుత్తు పంపిణీ సంస్థ కేటాయించిన మేరకు విద్యుత్ వినియోగం ఉంటోంది. ఈ పరిస్థితుల్లో అక్కడక్కడ వర్షాలు కురవడం విద్యుత్ శాఖకు కొంత ఉపశమనం కల్పిస్తోంది. లేదంటే వినియోగం పెరిగి.. విద్యుత్ కోతలతో జనం విలవిల్లాడే వారంటూ సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

వారం రోజులుగా విద్యుత్ వినియోగం.. ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెంటీగ్రేడ్లలో)	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో..)
17	40.0	9.63
18	40.0	9.43
19	40.0	9.42
20	39.0	9.32
21	40.0	7.96
22	39.0	9.02
23	41.0	9.78

పెరుగుతున్న వినియోగం

రోజురోజుకీ ఎండలు పెరిగిపోతున్నాయి. రోజూ గరిష్ఠంగా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈక్రమంలో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. జిల్లాలో 10.19 లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.07 లక్షలు, వ్యవసాయ 2.06 లక్షలు, వాణిజ్యం, పరిశ్రమలు, వీధిదీపాలు ఇతరత్రా లక్షకుపైగా ఉన్నాయి. వీటన్నింటికీ రోజువారీగా 12.67 మిలియన్ యూనిట్లు విద్యుత్ పంపిణీ సంస్థ కేటాయిస్తోంది. కేటాయింపులకు ఇంచుమించుగా ప్రస్తుత వినియోగం ఉంటున్నట్లు తెలుస్తోంది. అధికారుల లెక్క ప్రకారం 10 మిలియన్ యూనిట్ల వరకు వినియోగం ఉన్నట్లు చెబుతున్నారు.

వర్షాలు, పంట సాగు తగ్గడంతో..

వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతోపాటు.. ఇదివరకు కురిసిన వర్షాలకు రాత్రి వేళల్లో కాస్త వేడి, ఉక్కపోత నుంచి జనం ఉపశమనం పొందుతున్నారు. ఈక్రమంలోనే విద్యుత్ వినియోగం కొంతవరకు తగ్గినట్లు అధికారులు అంటున్నారు. దీనికితోడు వేసవి కావడంతో సాగు విస్తీర్ణం కొంతవరకు తగ్గుముఖం పట్టింది. ఈప్రభావం విద్యుత్తు వినియోగంపై కనిపిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ కారణాలతో విద్యుత్ శాఖ అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నట్లయింది. లేదంటే పరిస్థితి మరోలా ఉండేదంటున్నారు.

వినియోగం తగ్గింది..



ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో కాస్త విద్యుత్ వినియోగం పెరుగుతుంది. వేసవి నేపథ్యంలో పంటసాగు విస్తీర్ణం తగ్గింది. వెరసి.. వ్యవసాయానికి విద్యుత్ వినియోగం తగ్గింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత వరకు వినియోగం తగ్గింది.

-శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

నాసిన్‌కు కేంద్ర మంత్రి

నేడు ఐఆర్ఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్

హిందూపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి గురువారం రాత్రి నాసిన్‌కు చేరుకున్నారు. గోరంట్ల మండలం కొళసముద్రం వద్దనున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌లో (నాసిన్) శుక్రవారం ఉదయం 75వ బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రికి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ స్వాగతం పలికారు.


కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న జేసీ అభిషేక్ కుమార్

తలసేమియా బాధితులకు సహకారం

- ఆపరేషన్‌కు ముందుకొచ్చిన సంకల్ప ఫౌండేషన్
- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తలసేమియాతో బాధపడుతున్న 15మంది చిన్నారులకు సంకల్ప ఫౌండేషన్ సహకారంతో బెంగళూరులో ఆపరేషన్ చేస్తారని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వర రావు తెలిపారు. జీజీహెచ్‌లోని పీడియాట్రిక్ విభాగ సమావేశమందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ తలసేమియా చిన్నారులను ఆదుకోవడం కోసం కలెక్టరు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈక్రమంలోనే బెంగళూరుకు చెందిన సంకల్ప ఇండియా ఫౌండేషన్‌ను సంప్రదించినట్లు తెలిపారు. ఆ సంస్థ వారు ఆస్పత్రిలో ఇప్పటివరకు 1500మందికి పరీక్షలు నిర్వహించగా ఇందులో 40మంది గర్భస్థ శిశువులకు తలసేమియా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే ఇప్పటికే తలసేమియాతో బాధపడుతున్న 15మంది చిన్నారులకు ఎముక మజ్జ మార్పిడి ఆపరేషన్‌లు చేయించడానికి సంకల్ప ఫౌండేషన్ ముందుకొచ్చిందన్నారు. ఈఆపరేషన్ చేయాలంటే ఒక్కొక్కరికి రూ.20 లక్షల నుంచి రూ.30లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అలాంటి ఆపరేషన్‌లు 15మందికి చేయించడానికి సంకల్ప ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. బాధితులకు బెంగళూరులో త్వరలో ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు హేమలత, సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టరు మోహన్‌రెడ్డి, అభిజిత్, పుష్ప, పీడియాట్రిక్ వైద్యులు డాక్టరు రవికుమార్, శంకరనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్ ఢీ కొన్న లారీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భారీ లోడుతో వస్తున్న ఓ లారీ నగరంలోని ట్రాఫిక్ ఐలాండ్‌ను ఢీ కొట్టింది. టవర్ క్లాక్ ఎదుట గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. బళ్లారి నుంచి తమిళనాడులోని గుడియట్టం వెళ్తున్న 12 చక్రాల లారీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగుతూ నేరుగా ట్రాఫిక్ ఐలాండ్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. ట్రాఫిక్ నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పెద్ద వాహనాలను నగరంలోకి అనుమతించరు. రద్దీ లేని సమయంలో, రాత్రి ఈ ఘటన జరగడంతో జనాలకు ప్రమాదం తప్పింది.



ట్రాఫిక్ ఐలండ్‌ను ఢీకొట్టిన లారీ

4 మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

తాడిపత్రిలో 3, కళ్యాణదుర్గంలో ఒక షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు మద్యం షాపులకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి గురువారం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. తాడిపత్రిలో 3, కళ్యాణదుర్గం పట్టణంలోని 1 మద్యం షాపునకు దరఖాస్తులు ఆహ్వానించారు. గత ఏడాది అక్టోబరు నెలలో జిల్లాలోని 136 మద్యం షాపులకు లాటరీ తీసి, ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారు. అయితే తాడిపత్రిలో 3, కళ్యాణ దుర్గంలో 1 మద్యం షాపు ప్రారంభించలేదు. రాజకీయ ఒత్తిడులు, ఇతర కారణాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మద్యం షాపులో ఓపెన్ చేయలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా మద్యం షాపులకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మే మూడో తేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మే 5న ఉదయం 8 గంటలకు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లాటరీ తీయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్‌తోపాటు జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లల్లో ఎక్కడైనా మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్‌రీఫండబుల్ ఫీజు చెల్లించాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగ సంచాలకుడు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ద్వితీయ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారన్నారు. ధర్మవరం, పామిడి, గుత్తిలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామన్నారు.

29, 30 తేదీల్లో పరీక్షలు వాయిదా...

ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్షలను వాయిదావేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ తెలిపారు. ఆ రోజున పాలిసెట్‌కు డిగ్రీ పరీక్షలు జరుగుతున్న కొన్ని కేంద్రాలను కేటాయించారన్నారు. దీంతో ఆ తేదీల్లో పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షలను మే 2, 3 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

పాలిసెట్ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్‌కు ఈనెల 17వరకు దరఖాస్తులు స్వీకరించారన్నారు. 30న పరీక్షలు ఉంటాయని అయన తెలిపారు.

30లోగా ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఏదైనా ప్రభుత్వ పాఠశాలలో చదివి స్టేట్ సిలబస్‌లో 500 మార్కులు, సెంట్రల్ సిలబస్‌లో 420 మార్కులు వచ్చినవారు అర్హులన్నారు. ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ స్కూల్, మున్సిపల్ హైస్కూళ్లలో చదివినవారు కూడా అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీటీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రైవేటు స్కూల్‌లో చదివినా ఆర్డీటీ సెట్‌కు అర్హులన్నారు. బీసీ కుటుంబాల్లోని ఆర్డీటీ స్పాన్సరర్స్ పిల్లలు ప్రైవేటు స్కూల్‌లో చదివినా అర్హులేనన్నారు. దరఖాస్తున్న 30లోగా కొత్తచెరువు ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అందజేయాలని ఏటీఎల్ తెలిపారు. వివరాలకు 8310827359, 9441734365 నంబర్లలో సంప్రదించాలన్నారు.

28 నుంచి ఉచిత సీట్లకు దరఖాస్తులు: ఆర్జేడీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్జేడీ శామ్యూల్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని జోన్-4 పరిధిలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉందన్నారు. ఒకటో తరగతి ప్రవేశానికి పిల్లల తల్లిదండ్రులు www.cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 25వ తేదీలోగా అన్ని గుర్తింపు పొందిన పాఠశాలలు వివరాలను సమర్పించాలన్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 20వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి


దుర్గేష్ (ఫైల్)

విడపనకల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంచనహాలు గ్రామానికి చెందిన గుడిసెల దుర్గేష్ (27) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. మిరపకాయలను సంచులలో నించే కూలి పనులకు వెళ్లిన దుర్గేష్.. ఎండకు తాళలేక స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గేష్‌కు భార్య వనిత, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు

న్యూస్ బాక్స్

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వెంకటస్వామి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల మహిళలు ఈనెల 30వ తేదీలోగా మండలంలోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. మండల వాసులై ఉండాలన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా ఆరాధనోత్సవం


భక్తులకు బాబా ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా భట్రాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజు ఫ్లెక్స్ కార్యాలయంలో భగవాన్ సత్యసాయిబాబా 14వ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మారుతిరాజు మాట్లాడుతూ... త్వరలో జరగబోయే బాబా శతజయంతి సందర్భంగా నవంబరు 23వ తేదీని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భట్రాజు సంక్షేమ సంఘం నాయకులు అక్కిరాజు సుధాకర్‌రాజు, ఏవి రాజు, శంకర నారాయణరాజు, గోవిందరాజు, వెంకటకుమార్, భాస్కర రాజు, రవికుమార్‌రాజు, మహేష్‌రాజు, ప్రసాద్, రమేష్, మహిళా విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'బాబా జీవితం సందేశాత్మకం'

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా జీవితం సమస్త మానవాళికి సందేశాత్మకమని జ్యోతిష్య పండితుడు రఘునాథ్ గురూజీ పేర్కొన్నారు. సత్యసాయిబాబా 14వ పుణ్యతిథిని పురస్కరించుకుని గురువారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సాయినగర్ స్లమ్ ఏరియా, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, అమ్మఒడి వృద్ధాశ్రమం తదితర ప్రాంతాల్లో అన్నదానం చేశారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎ.నారాయణపురం కార్యదర్శికి అవార్డు



అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌బాబు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ. నారాయణపురం పంచాయితీ గ్రేడ్-1 కార్యదర్శి ప్రవీణ్ బాబు ఉత్తమ సేవా అవార్డును గురువారం అందుకున్నారు. పన్ను వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను ఆయన జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పంచాయతీ అధికారి కార్యాలయ ఏఓ నాగరాజు, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

గార్లదిన్నె, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం అదృశ్యమైన కరేగౌడ్ (44) గురువారం శవమై కనిపించాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం సూగే కోనాపురానికి చెందిన కరేగౌడ్ వ్యవసాయ పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకునేవా డు. అతడు కొద్దికాలం నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. ఈనెల 20న తల్లి శివలింగమ్మతో కలసి వైద్యం చేయించుకునేందుకు అనంతపురం వచ్చాడు. అస్పత్రిలో వైద్యం చేయించుకుని సాయంత్రం గార్లదిన్నెలో ఉన్న చెల్లెలు ఇంటికి వచ్చాడు. సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కరేగౌడ్ కోసం చెల్లెలు, కుటుబ సభ్యులు వెతికారు. ఆచూకి లభించక పోవడంతో బుధవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అక్షర స్కూల్ సమీపంలో కరేగౌడ్ మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతి చెందినది కరేగౌడ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడకి భార్య నాగమణి, ఇద్దరు కుమారులున్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన సిద్దునాయక్(18) ఫుడ్ కేటరింగ్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తగ్గకపోవడంతో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీకి సర్పంచ్ ఫిర్యాదు

శింగనమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో అభివృద్ధి పనులను వైసీపీ కార్యకర్త, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్ రెడ్డి మరి కొందరు వైసీపీ నాయకులు అడ్డుకుంటు న్నారని మండలంలోని లోలూరు భాగ్యమ్మ ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. గురవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి విన్నవించినట్లు సర్పంచు తెలిపారు.

మెడికో ఆత్మహత్యాయత్నం


హన్సికకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకుంటున్న డీఎస్పీ బాబుప్రసాద్

గూడూరు/కర్నూలు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన వైద్య విద్యార్థి అంకె హన్సిక (19) కర్నూలు జిల్లాలో గురువారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు, స్థానికుల తెలిపిన మేరకు... ఆత్మకూరుకు చెందిన వ్యవసాయదారులు అంకె శ్రీనివాసులు, అనిత దంపతుల పెద్ద కుమార్తె హన్సిక. ఈమె కర్నూలు జిల్లా గూడూరు మండలం పెంచికలపాడు సమీపంలో ఉన్న విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్(ప్రథమ సంవత్సరం) చదువుతోంది. బాగా చదివేదని తోటి విద్యార్థులు తెలిపారు. కళాశాల యాజమాన్యం ప్రతి రెండు నెలలకు ఒక సారి ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తుంది. మొదటి ఇంటర్నల్ పరీక్షలు బాగా రాసి పాస్ అయ్యింది. రెండు రోజుల క్రితం నిర్వహించిన రెండో ఇంటర్నల్ పరీక్షలు సరిగా రాయలేదని తోటి విద్యార్థులతో చెప్పి బాధపడింది. తన స్నేహితులు గురువారం కూడా ఇదే విషయమై హన్సికకు ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం తల్లిదండ్రులతో కూడా ఫోన్లో మాట్లాడింది. అనంతరం మూడో అంతస్తు పైకెక్కి కిందకు దూకేసింది. మట్టిపై పడటంతో తలకు స్వల్ప గాయాలు కాగా.. భుజం ఎముకలు, వెన్నెముక బాగా దెబ్బతిన్నాయని, ఊపిరితిత్తుల్లో రక్తస్రవం అవుతోందని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

అంబులెన్స్ కోసం చూడకుండా...

మెడికో హన్సిక పై అంతస్తు నుంచి దూకినప్పుడు ఓ విద్యార్థిని చూసినట్లు పోలీసులు తెలిపారు. అదే కాలేజీలో పీజీ చదువుతున్న డాక్టర్ ఒకరు అంబులెన్స్ కోసం ఎదురు చూడకుండా తోటి విద్యార్థుల సాయంతో తన స్కూటిపై ఎక్కించుకొని ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. క్షణాల్లో అదే ఆస్పత్రి వైద్య నిపుణుల బృందం అక్కడికి చేరుకొని వైద్యం అందించడం ప్రారంభించారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, కర్నూలు తాలుకా సర్కిల్ సీఐ చంద్రబాబు, ఎస్.నాగులాపురం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డిలు ఘటనాస్థలానికి చేరుకొని హన్సిక ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కుమార్తె ఆత్మహత్యాయత్నం సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన విశ్వభారతి మెడికల్ కాలేజీకి చేరుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో మంచంపై అచేతనావస్థలు ఉన్న కుమార్తెను చూసి కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని కర్నూలు తాలుకా సర్కిల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

నీట్ ఏ కేటగిరిలో ర్యాంకు

వ్యవసాయ కుటుంబానికి చెందిన హన్సిక చదువులో ముందు ఉండేది. తన తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ నీట్‌లో ర్యాంక్ సాధించింది. కేటగిరి-ఏ కింద వైద్య విద్య (ఎంబీబీఎస్) సీటు సాధించింది. తొలి కౌన్సెలింగ్‌లో తిరుపతిలో ఓ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అక్కడ సరైన సౌకర్యాలు లేవని రెండో కౌన్సెలింగ్‌లో కర్నూలు జిల్లా లోని విశ్వభారతి వైద్య కళాశాలలో గత ఏడాది డిసెంబరులో చేరింది.

అర్హులైన రైతులందరికీ సంక్షేమ పథకాలు


సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● వ్యవసాయ పనిముట్ల పంపిణీ

రాప్తాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో కొంత మంది వైసీపీ వారికి మాత్రమే సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారని, ప్రస్తుతం ప్రభుత్వంలో అర్హులైన రైతులందరికీ సబ్సిడీ పరికరాలు అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో గురువారం రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు చెందిన 35 మంది రైతులకు రూ.25 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలు సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఇటీవలే మూడు మండలాలకు చెందిన రైతులకు 25 లారీల సబ్సిడీ డ్రిప్పు పరికరాలు అందజేశామన్నారు. గత ప్రభుత్వంలో ఐదెకరాలకు మాత్రమే సబ్సిడీ ద్వారా డ్రిప్పు, స్పింకర్లు అందజేశారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత పదెకరాల వరకూ అందచేస్తున్నామని తెలిపారు. త్వరలో అర్హులైన రైతులకు మరిన్ని వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, రాప్తాడు, ఆత్మకూరు మండల కన్వీనర్ కొండప్ప, శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, నాయకులు పాముదాయి రఘు, మరూరు గోపాల్, గంగలకుంట రమణ, వెంకట్రాముడు, సాకే జయరాముడు, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, కిష్టా, బీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు ఎమ్మెల్యే నివాళి

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు పిరికి పందల్లా దాక్కుని అమాయకులైన పర్యాటకుల మీద దాడి చేసి చంపారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గామ్ ఘటనలో మృతి చెందిన వారికి కన్నీటి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులకు ఆత్మశాంతి కలగాలని కాసేపు మౌనం పాటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారన్నారు. రానున్నరోజుల్లో ఖచ్చితంగా మర్చిపోలేని సమాధానం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.


ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

అనంతపురం రూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో కార్యాక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించిరు. వైస్ సర్పంచ్ ఆలం వెంకటనరసానాయుడు హాజరై మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో అనంతకు అగ్రస్థానం గర్వకారణం

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల నిర్వహణలో అనంత జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో స్వచ్ఛతపై జిల్లా అధికారయంత్రాంగం చూపిన కృషికి, ప్రజల సహకారానికి ఇది నిదర్శనమన్నారు. ఈ గొప్ప విజయానికి శ్రీకారం చుట్టిన ఘనత కలెక్టర్ వినోద్‌కుమార్‌కు దక్కుతుందన్నారు. స్వచ్ఛాంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఎంపీ అంబికా అభినందించారు.

కరెంటు కష్టాలు..!

● ఓవర్‌లోడుతో ఆగిన విద్యుత్తు సరఫరా

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని నరసనాయనికుంట గ్రామ పరిధిలోని ఎస్సీల కాలనీ వాసుల కరెంటు కోసం అష్టకష్టాలు పడ్డారు. ఓవర్‌లోడు కారణంగా గురువారం రాత్రి 8 గంటల సమయంలో కాలనీకి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు ఖాళీపోయాయి. దీంతో కరెంటు కోసం నానా అవస్థలు పడ్డారు. చీకట్లో.. సెల్‌ఫోన్ లైట్, టార్చ్‌లైట్ వెలుతురుతో..నిచ్చెన వేసుకుని మరమ్మత్తులు చేసుకున్నారు. నిత్యం ఇదే సమస్య తలెత్తున్నట్లు కాలనీ వాసులు అంటున్నారు. ఎనిమిది, పదేళ్లుగా ఇదే విధంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

డీపీఓ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్ వినోద్ కుమార్‌ను సన్మానిస్తున్న డీపీఓ, ఇతర సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా... జిల్లాలో స్వచ్ఛాంధ్ర ప్రోగ్రామ్ అమలుపై రాష్ట్రస్థాయి కార్యక్రమంలో గురువారం కలెక్టర్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీంతో అక్కడే కలెక్టర్‌ను డీపీఓ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఎంపీడీఓ సాల్మాన్‌రాజ్, సౌజన్య, ఈఓఆర్డీలు నాగేశ్వర శాస్త్రి, ఆనంద్ ప్రసాద్, సదాశివ, శైలజ, శ్యామల, ఏపీ పంచాయతీకార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శంకర్, పంచాయతీ కార్యదర్శులు హిదయతుల్లా, సర్దార్, రెడ్డమ్మ, అనీల్, వరలక్ష్మి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నగరంలో మట్కా నిర్వహిస్తున్న ఐదుగురు బీటర్లను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం గుత్తిరోడ్డులో మట్కా నిర్వహిస్తుండగా ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.22,800 స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాస్తున్న ప్రతి ఒక్క అభ్యర్థి రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆన్‌లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో గురువారం ఆన్‌లైన్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి డైరెక్టర్ సుమన జయంతితోపాటు బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుమన జయంతి మాట్లాడుతూ... ఆన్‌లైన్ శిక్షణా తరగతులను సద్విని యోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ ప్రయత్నం చేశారన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య : జనసేన


సంతాపం తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి హేయ మైన చర్య అని జనసేననాయకులు అన్నారు. ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి మూడ్రోజుల కన్నీటి నివాళిలో భాగంగా రెండో రోజు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సంతాపం తెలిపారు. ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన



కొవ్వులతో టీడీపీ నాయకుల నిరసన ప్రదర్శన

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదా డిని నిరసిస్తూ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కొట్టాల నుంచి గురువారం రాత్రి ప్రధానరోడ్డు గుండా ఉగ్రదాడిలో మృతులకు సంతా పంగా కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు.

రాజకీయాలకు అతీతంగా స్పందించాలి : సీపీఐ


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం టెర్రరిస్టుల దాడి ఘటనపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్పందించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో క్లాక్ టవర్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రాము, ధనుంజయ, దుర్గాప్రసాద్, అక్కులన్న తదితరులు పాల్గొన్నారు.

పౌరులపై ఉగ్రదాడి నీచమైన చర్య : ఏఐడీఎస్ఓ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో సాధారణ పౌరులపై ఉగ్రమూకలు దాడికి పాల్పడి హతమార్చడం నీచమైన చర్య అని ఏఐడీఎస్ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి శిబాసిస్ ప్రహరాజ్, జిల్లా ఇన్చార్జి సురేష్ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రదాడిలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాల్లో దేశప్రజలు భరోసా నింపి, అండగా నిలవాలని కోరారు. దాడికి పాల్పడిన ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిబంధనలకు అనుగుణంగా రుణాల ప్రక్రియ : ఈడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సీ సబ్సిడీ రుణాల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా సాగుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక అన్నారు. స్థానిక సీపీఓ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై దరఖాస్తుదారులకు సందేహాల నివృత్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈడీ రాధికతో పాటు మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ హాజరయ్యారు. ముందుగా పలువురు దరఖాస్తు దారులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ... సబ్సిడీ రుణాల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధలకు అనుగుణంగానే జరుగుతాయన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు వెళ్లవద్దన్నారు.

చియ్యేడులో వనభోజనాలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చియ్యేడులో గ్రామస్థులు వనభోజనాలు నిర్వహించారు. గ్రామాన్ని వదిలి.. గురువారం సమీపంలోని పొలాలకు వెళ్లారు. అక్కడే వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలు, పెద్దలు, ఆటలు ఆడుతూ..ఊయాలలు ఊగుతూ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. సాయంత్రం అందరూ ఒకే సారి గ్రామంలోకి చేరుకున్నారు

పదిలో హాస్టల్ విద్యార్థుల ప్రతిభ


హరికృష్ణ

శింగనమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలో పది ఫలితాల్లో శింగనమల బీసీ బాలురు వసతి గృహం విద్యార్థులు ప్రతిభ చూపారు. వసతి గృహంలో 18 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 16 మంది ఉత్తీర్ణత సాధించారు. వసతి గృహం విద్యార్థి వడ్డే హరికృష్ణ 525 మార్కుల్ సాధించినట్లు వార్డెన్ మస్తాన్ తెలిపారు.

రెస్టారెంట్లపై జేసీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు రెస్టారెంట్లు, పాల డెయిరీలు, హోటళ్లపై జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆహార భద్రతాశాఖ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ దాడులు నిర్వహించారు. ఈ మేరకు గురువారం నగరంలోని రెస్టారెంట్లు, పాల డెయిరీలు, హోటళ్లలోని తినుబండారాలలో సింథటిక్ రంగుల వాడకం, అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలను గుర్తించారు. ఇందుకుగానూ దాదాపు నాలుగు రెస్టారెంట్లు, రెండు డెయిరీ ఉత్పత్తులకు రూ. 81వేలు జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు.

చదువు, క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్యే

కనగానపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చదువు, క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. కనగానపల్లిలో సర్పంచ్ అంకే పరిమలా రామక్రిష్ణ, తెలుగు యువత బట్టా సురేష్‌చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిటాల రవీంద్ర మెమోరియల్ క్రికెట్ పోటీలను గురువారం ఆమె ప్రారం భించారు. ముందుగా కశ్మీరులో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మార్కెట్‌యార్డ్ చైర్మేన్ సుధాకర్ చౌదరి, కన్వీనర్ యాతం పోతలయ్య, ముకుంద నాయుడు, ఎంపీటీసీ బిల్లే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

● రాప్తాడు: మండలంలోని బోగినేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కంసల సురేంద్ర ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం బోగినేపల్లికి వెళ్లి సురేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉజ్జినప్ప, టీడీపీ నాయకులు నారా నారాయణ, నాగప్ప, కాటమయ్య పాల్గొన్నారు.

సహకార సొసైటీల్లో స్వయం సహాయక సంఘాల సేవలు

అనంతపురంక్లాక్‌టవర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలలో స్వయం సహాయక సంఘాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సేవలు అందిస్తామని జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో బిజినెస్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ అరుణకుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ.... 1964 సహకార సొసైటీ చట్టం అమలు, విధానాలపై తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలలో సొసైటీల ఏర్పాటుతో స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధుల పెంపుపై వివరించారు.

నెట్టికంటి సన్నిధిలో మన్యుసూక్త హోమం

గుంతకల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పూర్వాభాద్రా నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఉదయం మన్యుసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆలయ యాగశాలలో ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి తిరుమంజన స్నపనం చేసి, తులసి మాల, పుష్పాలతో అలంకరించి మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ వాణి, అధికారులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలయ పుష్కరిణిలో పారిశుధ్య చర్యలు..

గుంతకల్లు: కసాపురం ఆలయ పుష్కరిణిలోని నీటిని భక్తుల సౌకర్యార్థం వినియోగించనున్నట్లు ఆలయ ఈఓవాణి పేర్కొన్నారు. భద్రతా కారణాలతో దాదాపు పదేళ్ల కిందట భక్తులు బావిలోకి దిగకుండా పుష్కరిణిని మూసేశారు. దూరంగా బోరువేసి కల్యాణకట్ట వద్ద కొళాయిలను ఏర్పాటుచేసి తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానాలు చేసేలా ఏర్పాటుచేశారు. అయితే పైపులైన్ పగిలినప్పుడు ఇబ్బందులు ఎదురౌతుండటంతో, ఎప్పుడూ నీరు లభించే పుష్కరిణి నుంచే నీటిని వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు అందులో నిల్వ ఉన్న అపరిశుభ్రమైన నీటిని బయటకు పంపుచేసి, పూడికను తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. త్వరలో పుష్కరిణి నీటిని కల్యాణకట్ట వద్ద కొళాయిలకు అందిస్తామని ఆలయ అధికారులు తెలియజేశారు.

శేషవాహనంపై ఊరేగిన శ్రీవారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శేషవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌ను పవిత్ర గంగాజలంతో అభిషేకించి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన చేసి మహామంగళహారతి ఇచ్చారు. తర్వాత రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బాల్య వివాహాలపై అవగాహన

గుత్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయం లో గౌతమి మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఇందులో జిల్లా బాలల పరిరక్షణ సంస్థ వారు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఆసంస్థ ప్రొటెక్షన్ అధికారిణి వెంకటేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు కలిసి పని చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలువులు ఉండటంతో గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగే ఆస్కారం ఉందని, ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తర్వాత పోక్సో చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ. 4వేలు ఆర్థిక సాయం అందించన్నుట్లు చెప్పారు. ఏపీఎం అరుణకుమారి, సీసీలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

గుత్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీని గురువారం ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ కమిటీలో పట్టణానికి చెందిన కృష్ణయ్య, విజయ్‌భాస్కర్ చౌదరి, అనంతగిరి, రవికుమార్, ఆనంద్‌బాబును నియమించినట్లు చెప్పారు. వారికి రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్‌బాబు ఐడీ కార్డులను అందజేశారు. గుత్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ వారు పేర్కొన్నారు. అవకాశం కల్పించిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రిప్ పరికరాలు దగ్ధం

రాయదుర్గం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన విఠల్‌స్వామి అనే రైతు పొలంలో డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. తనకున్న రెండెకరాల పొలంలో మొక్కజొన్న పంటను సాగుచేసి డ్రిప్‌ను ఏర్పాటు చేశానని, ఈ మధ్యనే పంట కోశానని, అయితే గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ఎండిన మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టడంతో డ్రిప్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తెలిపారు. రూ. రెండు లక్షల మేర నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేట్ , కార్పొరేట్ స్కూళ్ల నిర్వహిస్తున్న ఇంటింటా అడ్మిషన్ల ప్రచారం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు పది ఫలితాలు విడుదలవగానే.. విద్యార్థుల మార్కులు చూపిస్తూ తమ స్కూల్ గొప్పదంటూ, కనుక మాపాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలంటూ ఇంటింటికీ సిబ్బందిని పంపి ప్రచారం సాగిస్తున్నాయని తెలిపారు. ముందస్తుగానే అడ్మిషన్లు చేస్తున్న ఈ స్కూళ్లపై చర్యలు విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిల్, విష్ణు, ఇర్ఫాన్, లోకేష్, సాయి, గణేష్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

కంబదూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కోట కాలనీలో నివాసం ఉంటున్న కట్టా నాగరాజు ఇంటిలోకి గురువారం పట్టపగలే దొంగలు చొరబడి బీరువా పగులకొట్టి రూ.50 వేలు చోరీ చేశారు. బాధితుడు ఇంటికి తాళాలు వేసుకుని సమీపంలోని గడ్డివాము దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చే లోగా దుండగులు ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ప్రవీణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థికి అధికారుల అభినందనలు

శెట్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న బుద్ధిమాంద్యం విద్యార్థి కే వెంకటేష్ ఏలూరు జిల్లాలోని హిల్ ప్యారడైజ్ స్కూల్‌లో ఈ నెల 21 నుంచి బుధవారం వరకు నిర్వహించిన స్పెషల్ ఒలంపిక్ భారత్‌కు ఎంపికయ్యాడు. 26 జిల్లాల నుంచి బుద్ధిమాంద్యం గల విద్యార్థులు అందులో పాల్గొన్నారు. వెంకటేశ్ వంద మీటర్ల రన్నింగ్ రేస్‌లో తృతీయ స్థానం, 200 మీటర్ల రన్నింగ్ రేసులో మొదటిస్థానంలో విజేతగా నిలిచాడు.దీంతో అతడికి మెడల్ సర్టిఫికెట్‌ను అందించారు. వెంకటేష్‌ను ఎంఈవోలు శ్రీధర్, వాణి దేవి, హెచ్‌ఎం ఫిరోజ్‌ఖాన్, అభినందించారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

కూడేరు, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాణి స్కూల్ ఆఫ్ లర్నింగ్ ప్రైవేటు పాఠశాలలో గురువారం స్కూల్ డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కూడిన చదువును అభ్యసించాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ఎంఈఓ గౌస్‌మొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు


తాడిపత్రిలో దిష్టిబొమ్మను తగలబెడుతున్న సీపీఐ నాయకులు


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య: కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌జిల్లా పెహల్గాంలో 28 మంది భారత పౌరులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికి పంద చర్య అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అభివర్ణించారు. పట్టణంలోని ఒకటవ వార్డులో గురువారం పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది. ఇందులో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత పర్యాటకులపై ఉగ్రదాడుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఉగ్రవాదులు ప్రయోగించిన ప్రతి తూటాకు తగిన సమయంలో భారత్ తప్పక సమాధానం ఇస్తుందని హెచ్చరించారు.

దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఉరవకొండ: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపంద చర్య అని శాసనమండలి సభ్యుడు శివరామిరెడ్డి పేర్కొన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడటం దారుణమన్నారు. హింస అన్నది ఏరూపంలో ఉన్నా ఆమోదయోగ్యం కాదన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

తాడిపత్రి: జమ్మూకశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పట్టణంలోని సీపీఐ నాయకులు స్థానిక నంద్యాలరోడ్డులో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు రంగయ్య మాట్లాడుతూ యాత్రికులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని అన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణరెడ్డి, ఎర్రప్ప, వెంకటయ్య, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని హిందువులు ఉగ్రవాదులు దాడిని తీవ్రంగా ఖండిస్తూ స్థానిక గాంధీకట్ట నుంచి పోలీస్‌స్టేషన్ సర్కిల్ భారీగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న మతసామరస్యాన్ని చూసి ఉగ్రవాదులు ఓర్వలేకపోయారని, దీంతో సమైక్యత దెబ్బతీయడానికి ఇలాంటి దాడులు చేశారని పేర్కొన్నారు. అనంతరం మృతుల ఆత్మకు శాంతి కలగాలని కొద్దిసేపు మౌనం పాటించారు.


రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ తదితరులు

●రాయదుర్గం: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదదాడిలో మరణించిన వారి ఆత్మ కు శాంతి చేకూరాలని వీహెచ్‌పీ నాయకులు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి వినాయకసర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి కొద్ది సేపు మౌనం పాటించారు. వీహెచ్‌పీ నియోజకవర్గ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు పంచాయతీలకు ఉత్తమ అవార్డులు

బెళుగుప్ప/ ఉరవకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సం దర్భంగా పలు పంచాయతీలకు ఉత్తమ అవార్డులు లభించాయి. స్వచ్ఛంద పథకం విజయవంతంగా అమలు చేయడంతో ఈ అవార్డులు వచ్చాయి. ఈ క్రమంలో బెళుగుప్ప మండలం తగ్గుపర్తి పంచాయతీకి ఉత్తమ అవార్డు లభించగా.. ఇందుకు గ్రామ సర్పంచ్ దబ్బర మౌనికకు జిల్లాకేంద్రంలో గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. అలాగే ఉత్తమ అవార్డు అందజేశారు. అదేవిధంగా ఆవులెన్న గ్రామం కూడా ఉత్తమ పంచాయతీగా ఎంపికైనందున ఆ గ్రామ సర్పంచ్ రామ్మోహన్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇక ఉరవకొండ మండలం వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు కూడా గిరిజమ్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.


తగ్గుపర్తి సర్పంచ్ మౌనికను అభినందిస్తున్న కలెక్టర్

అక్షయకు సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న విద్యాధికారులు

పుట్లూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీ లో గురువారం పదో తరగతి ఫలితాల్లో మండలంలో అత్యధికంగా 568మార్కులు సాధించిన విద్యార్థిని అక్షయకు ఎంఈఓ శ్రీదేవి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో చదివిన అక్షయ అధిక మార్కులు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పాస్టర్ల కృతజ్ఞతలు

రాయదుర్గం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు పాస్టర్లకు గౌరవవేతనాలు చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు సీఎం అవగానే మాట నిలబెట్టుకుని ఏడునెలలుగా వేతనాలు చెల్లిస్తున్నారని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ తెలిపారు. పట్టణంలోని కోతిగుట్టలో ఉన్న ప్రసన్న మందిరంలో గురువారం జరిగిన క్రైస్తవుల ఆత్మీయసదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పాల్గొన్నారు. అందరూ చంద్రబాబు చిత్రపటాన్ని ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్ల వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగరాజు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిన్నక్రిష్ణ పాల్గొన్నారు.



చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పాస్టర్లు

నేడు మండల సర్వసభ్య సమావేశం

బెళుగుప్ప, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించన్ననట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, గురువారం ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో షీజ సత్తా

ఉరవకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన షీజ జిల్లా స్థాయిలో అత్యధికంగా 596 మార్కులు సాధించింది. స్థానికంగా నివాసం ఉన్న బాబయ్య, శర్మస్‌బేగంకు మార్తె షీజ వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగ తి చదివింది. ఆమె తండ్రి ధర్మవరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. షీజకు పాఠశాల యాజమాన్యం గురువారం మిఠాయి తినిపించి అభినందనలు తెలిపింది. అలాగే అదే పాఠశాలకు చెందిన ప్రహర్షిత, యామిని 588మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ నాగరత్న తెలిపారు.


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కరెస్పాండెంట్

కవలలకు సమాన మార్కులు

కణేకల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఫజాన్, ఫైజాన్ అనే కవలలిద్దరూ పదో తరగతి ఫలితాల్లో యాదృచ్ఛికంగా చెరీ 541 మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. స్థానిక దిగువగేరికి చెందిన మహబూబ్ బాషా, షబానా దంపతుల కుమారులైన ఫజాన్, ఫైజాన్ కవలలు. వీరు స్థానిక నేషనల్‌స్కూల్‌లో చదివారు. అయితే పది ఫలితాల్లో ఎక్కువ.. తక్కువ కాకుండా ఒక్కొక్కరికి 541 మార్కులు వచ్చాయి. కవలలైన వీరు ఒకేలా మార్కులు సాధించడంతో ఆశ్చర్యపోవడం అందరి వంతు అయింది.


కవలలు ఫజాన్, ఫైజాన్

ప్రతిభావంత విద్యార్థినికి ఆర్థిక సాయం

కంబదూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని కొడతల చందనకు అధికారులు ఆర్థికసాయం అందించారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదివిన ఆ విద్యార్థిని మండలంలోనే అత్యధికంగా 565 మార్కులు సాధించింది. ఇందుకు గాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమెను అభినందించి సత్కరించారు. అలాగే ఇన్‌చార్జ్ ఎంపీడీవో గూడెన్న, ఏవో తిప్పయ్య, టెక్నికల్ అసిస్టెంట్ ఉస్మాన్‌వలి తదతరులు కలిసి రూ.2016 నగదును అందజేశారు.


విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న అధికారులు

విద్యార్థినికి అధికారుల సన్మానం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విజ్ఞాకార్తీక టెన్త్ ఫలితాల్లో మండలంలోనే అత్యధికంగా 575 మార్కులు సాధించింది. ఇందుకు గాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్డీ దాస్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి ఆమెకు శాలవ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, జూనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న అధికారులు

పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ పొందుతున్న భర్త చనిపోయి ఉంటే వారి స్థానంలో భార్య పింఛన్ పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ గురువారం ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబరు 1నుంచి 2024 అక్టోబరు 31వ తేదీల మధ్య కాలంలో భర్త చనిపోయిన వారికి మాత్రమే అవకాశం ఉందని చెప్పారు.

● రాయదుర్గం: మండలంలోని 19 పంచాయతీల్లోని సచివాలయల్లో నూతన వితంతు పింఛన్ మంజూరుకు ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అయిందని, వితంతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కొండన్న ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 30 తేదీల మధ్య కాలంలో మరణించిన వారి భార్యలకే అవకాశం ఉందన్నారు.

మద్యంషాపులకు ..

తాడిపత్రి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ2లక్షలు డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ నాయుడు గురువారం తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఉత్తర్వుల మేరకు పట్టణంలో మూడు మద్యం షాపుల కోసం మే 3వతేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను జిల్లాలోని ఏ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా అందజేయవచ్చని చెప్పారు.

ఆర్డీటీ సెట్‌కు..

రాయదుర్గం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 10వ తరగతిలో 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్ దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీటీ ఏటీఎం పుల్లారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు దరఖాస్తులు పట్టణంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో పొందాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. ఏ పాఠశాలలోనైనా చదివి 500పైన మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఓసీలైతే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిని వారు అర్హులన్నారు. లేటెస్ట్ పాస్ ఫొటోలు రెండు, వాట్సప్‌లో వచ్చిన రిజల్ట్ జిరాక్స్, హాల్‌టిక్కెట్ జిరాక్స్, విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కుల,ఆదాయ సర్టిఫికెట్ల జిరాక్సులు, రేషన్‌కార్డు జిరాక్స్‌లను దరఖాస్తుకు జత చేసి అందించాలని అన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొరుగు సేవల పోస్టులకు..

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న పొరుగుసేవలైన కుక్, స్వీపర్ పోస్టులకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎం ఈఓ నాగమణి గురువారంప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమగ్ర శిక్షణ ఔట్‌సోర్సింగ్ ద్వారా కేజీబీవీలో ఒక కుక్ పోస్టు, రెండు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

తాడిపత్రి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ లో గురువారం ఎస్‌ఐ గౌస్‌బాషా ఆధ్వర్యంలో సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అక్కడి అనుమానితుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకే జాగిలాలతో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు. జిల్లా డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్లూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల - ఏ. కొండాపురం గ్రామాల మధ్య అరటితోటలో గల పేకాటకేంద్రంపై గురువారం రాత్రి దాడులు చేసినట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. అందులో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.58వేల నగదు, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం విక్రేత..

యాడికి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాలకట్ట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గంగరాజు అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు జరిపి గంగరాజును అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి 12మద్యం బాటిళ్లను సీజ్‌చేసినట్లు చెప్పారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

కణేకల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చిక్కణ్ణేశ్వర కళ్యాణమంటపంలో గురువారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండల వ్యాప్తంగా పలు గ్రామాల ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులతో పాటు స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఎంపీటీసీ నరేంద్ర, ఆది, జయరాంచౌదరి తదితరులు హాజరయ్యారు.

పాముకాటుతో మహిళా కూలీకి అస్వస్థత

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ గ్రామంలో గురువారం ఉపాధి పనులకు వెళ్లి ఓ మహిళా కూలీకి పాముకాటు వేసింది. గ్రామానికి చెందిన నాగవేణి అనే మహిళా కూలీ ఉపాధి పనులకు వెళ్లింది. అక్కడ కాలువ పనులు చేస్తుండగా విషసర్పం కాటు వేసింది. స్థానికులు వెంటనే కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పినట్లు తెలిసింది.

కుక్క కాటుతో ఇద్దరు చిన్నారులకు గాయాలు

బొమ్మనహాళ్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తార్కాపురంలో గురువారం కుక్క కాటుతో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన హెచ్ హనుమంతు కుమార్తె శిరీష, వరుణ్ కుమార్తె పల్లవి ఆడుకుంటుండగా అకస్మాత్తుగా కుక్కవచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుటుంబసభ్యులు దానిని తరిమి చిన్నారులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

యాడికి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని భైరవకొండపై ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ కనెక్షన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాడికిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. దీంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మహేష్, యాడికి పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


పామిడి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవం జరుపుతున్న అధికారులు, ఉద్యోగులు

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

● పలు చోట్ల పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఉరవకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం ఉద్యోగులను సన్మానించారు. సర్పంచ్ లలితమ్మ, ఈవో గౌస్, టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, వార్డు సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

●బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం జరిగింది. ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ మునివేలు తదితరులు ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉంతకల్లుకు చెందిన గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం చేశారు. ఈఓపీఆర్డీ దాస్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ జేఈఈ జగదీష్ పాల్గొన్నారు.

●పామిడి: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరచిన పంచాయతీ కార్యదర్శులను, ఆధార్ డిజిటల్ అసిస్టెంట్లను సన్మానించారు మండల పరిషత్ కార్యాలయం, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

●శెట్టూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీఓ రఘురామారావు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని సూచించారు. సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●బెళుగుప్ప: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో సర్పంచ్ సలీబాయి, అధికారులు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యదర్శి శివరంజని, టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

●బ్రహ్మసముద్రం: మండలంలోని సంతేకొండాపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ మల్లెల వనిత ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం జరిగింది. ఇందులో పంచాయతీ కార్యదర్శి అనిత, క్లస్టర్ ఇన్‌చార్జి ఓబుళేసు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

●యాడికి: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు, సర్పంచు అనురాధ, వార్డు సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.